క్లుప్తంగా

నేడు ఎమ్మెల్యే రాక

ఆత్మకూర్: ఆత్మకూర్ మండలంలోని పలు అభివృద్ధి కార్యక్రమాల్లో బుధవారం మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి పాల్గొంటారని తహసీల్దార్ చాంద్‌పాషా, ఎంపీడీఓ సుజాత ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు బాలకిష్టాపూర్‌లో సబ్సిడీ గ్యాస్ పత్రాల పంపిణీ, 12 గంటలకు ఎంపీడీఓ కార్యాలయంలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ ఉంటుందని తెలిపారు. లబ్ధిదారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



పాన్‌గల్: మండలంలోని బండపల్లికి చెందిన కోమారి వెంకటస్వామికి మంజూరైన రూ.60 వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును మంగళవారం మాజీ జెడ్పీటీసీ రామ్మూర్తి నాయుడు అందజేశారు. పేదలు కార్పొరేటు ఆస్పత్రిలో వైద్యం చేయించుకునేలా ప్రభుత్వం సీఎం సహాయనిధి మంజూరు చేస్తోందన్నారు. సీఎం సహాయనిధి చెక్కు మంజూరు చేయించిన రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డా.చిన్నారెడ్డికి, కాంగ్రెస్ మండల నాయకులకు బాధితులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మేస్త్రీ నర్సయ్య, యుగేందర్, వెంకటేశ్వర్లు, మేస్త్రీ ఆంజనేయులు, రాముడు, నాగరాజు, లక్ష్మయ్య, నాగేశ్వర్, బాలకృష్ణయ్య, మన్నెయ్య పాల్గొన్నారు.

ఏటీఎం అద్దాలు ధ్వంసం



అమరచింత: పట్టణంలోని ఇండియా నెంబర్ 1 ఏటీఎం అద్దాలను గుర్తుతెలియని దుండగులు ధ్వంసం చేశారు. మంగళవారం తెల్లవారు జామున గుర్తు తెలియని వ్యక్తులు ఏటీఎంపై రాళ్లతో దాడి చేసి అక్కడి నుంచి వెళ్లి పోయారు. ఏటీఎంల వద్ద సెక్యూరిటీ గార్డులేకపోవడం, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయకపోవడంతో ఇలాంటి సంఘటన జరిగిందని స్థానికులు తెలిపారు. ఏటీఎం నిర్వాహకులు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సురేష్ తెలిపారు.

వామపక్ష పార్టీల ఆందోళన



వనపర్తి రూరల్: పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులు ఆపాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జబ్బార్ కోరారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో ఇజ్రాయిల్ దాడులకు నిరసనగా ఆందోళన చేపట్టారు. ఇజ్రాయిల్ యుద్ధ కాంక్షతో నిరంతరం ఇరాన్, పాలస్తీనా, విమోచన ఏమోన్, లెబనాన్ వంటి దేశాలపైన నిరంతరం దాడులకు పాల్పడుతూ అంతర్జాతీయ ఉద్రిక్తలకు కారణమవుతుందని విమర్శించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి విజయరాములు మాట్లాడారు. కార్యక్రమంలో వామపక్ష సభ్యులు మండ్ల రాజు, దేవేందర్, రమేష్, రాము, ఉమ, సాయిలీల, మహేష్, మధు, ఎన్ రాములు, శ్రీహరి, గోపాలకృష్ణ, కుతుబ్, తదితరులు పాల్గొన్నారు

నేడు ఎమ్మార్పీఎస్ నిరసన



గోపాల్‌పేట: మాదిగలకు అన్యాయం చేస్తూ డీఎస్సీలో జాబ్‌లను ఇతర కులాలకు కేటాయించడంతో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో వనపర్తి జిల్లా కేంద్రంలో నిరసన కార్యక్రమానికి మాదిగలు, అనుబంధ కులాల వారు తరలి రావాలని కొమ్ము చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని తాడిపర్తిలో మహనీయుల విగ్రహాల వద్ద సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి మాదిగలకు అన్యాయం చేస్తూ డీఎస్సీ ఉద్యోగాలు భర్తీ చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ పవన్‌కల్యాణ్ మాదిగ, గట్టుస్వామి మాదిగ, తదితరులు పాల్గొన్నారు.



కొత్తకోట కన్యకాపరమేశ్వరి ఆలయంలో మహాలక్ష్మీదేవిగా..



కొత్తకోట భవానీ మాత ఆలయంలో అర్ధనారీశ్వరదేవిగా..



కొత్తకోట దత్తకోటిలింగేశ్వరస్వామి ఆలయంలో లలితాదేవిగా..



అమరచింత కాళికాలయంలో లలితాత్రిపుర సుందరి అవతారంలో..

వివిధ రూపాల్లో జగన్మాత..

- దుర్గామాతకు మహిళల ప్రత్యేక పూజలు
- మండపాల వద్ద అన్నదానం

సాక్షి, నెట్‌వర్క్: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఆరో రోజు వైభవంగా కొనసాగాయి. కొత్తకోట వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో మహాలక్ష్మీదేవిగా అమ్మవారు పూజలందుకున్నారు. కానాయపల్లి శ్రీదత్తకోటిలింగేశ్వరస్వామి ఆలయంలో లలితాదేవిగా, భవాని మాత ఆలయంలో అర్ధనారీశ్వరిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయాల్లో మహిళలు కుంకుమార్చన, సామూహిక పూజలు చేశారు.

■ అమరచింత, ధర్మాపురం, ఈర్లదిన్నెలో లలితా త్రిపుర సుందరి అవతారంలో ప్రత్యేక పూజలు అందుకున్నారు. మండపాల వద్ద మహిళలు బతుకమ్మ ఆడుతూ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

■ ఆత్మకూర్ పట్టణంలో నీలకంఠేశ్వరస్వామి, వాసవి కన్యకాపరమేశ్వరి, బాలబ్రహ్మేశ్వరస్వామి, కోట్లాంజనేయస్వామి, అష్టలక్ష్మి ఆలయాల్లో, వాల్మీకినగర్‌లో, కేశవనగర్‌లో మండపాల్లో అమ్మవారు లలితా త్రిపుర సుందరి దేవిగా దర్శనమిచ్చారు.

■ ఖిల్లాఘనపురం, ఉప్పరిపల్లి సవరమ్మ, బద్రినారాయణస్వామి దేవాలయాల్లో మహా లక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చింది. ఉప్పరిపల్లిలో అమ్మవారిని రూ.55,550 (అన్ని యాభైరూపాయల నోట్లు)తో అలంకరించారు,

■ వీపనగండ్ల ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో అమ్మవారిని రూ.4.50లక్షలతో ధనలక్ష్మీగా అలంకరించారు.

■ పాన్‌గల్, కేతేపల్లి, గోప్లాపూర్, మాందాపూర్ గ్రామాల్లో మహాలక్ష్మీదేవిగా పూజలందుకున్నారు.

■ ఆత్మకూర్‌లోని కేశవనగర్‌లో స్వర్ణకారుల సంఘం ఆధ్వర్యంలో అమ్మవారిని రూ.11.11లక్షలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



కొత్తకోట వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారికి పూజలు చేస్తున్న మహిళలు



ఆత్మకూర్‌లోని వాసవీమాత ఆలయంలో సహస్రకుంకుమార్చనలో భక్తులు



ఆత్మకూర్‌లో స్వర్ణకారుల ఆధ్వర్యంలో అమ్మవారిని పూజలు నిర్వహిస్తున్న భక్తులు



ఖిల్లాఘనపురం మండలం ఉప్పరిపల్లి లో లక్ష్మీదేవిగా..



వీపనగండ్లలో ధనలక్ష్మీ రూపంలో దర్శనం ఇచ్చిన అమ్మవారు



పాన్‌గల్: మహాలక్ష్మీదేవిగా అమ్మవారు

బీజేపీ సంబరాలు



కొత్తకోట చౌరస్తాలో బాణ సంచాకాల్చి సంబరాలు చేస్తున్న బీజేపీ నాయకులు



అమరచింతలో..

కొత్తకోట రూరల్: హరియాణ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ మూడోసారి ఘన విజయం సాధించడంతో కొత్తకోట బీజేపీ శ్రేణులు మంగళవారం స్థానిక చౌరస్తాలో బాణా సంచా కాల్చి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ సీనియర్ నాయకులు మాట్లాడుతూ 10 ఏళ్లగా హరియాణలో అభివృద్ధిని చూసి ఆ రాష్ట్ర ప్రజలు పట్టం కట్టారన్నారు. కార్యక్రమంలో కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు దాబ శ్రీనివాస్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, నరేందర్‌గౌడ్, భరత్‌భూషణ్, రాఘవేందర్‌రెడ్డి, ఆవుల రాఘవేంద్రగౌడ్, లచ్చగౌడ్, బాలకృష్ణశెట్టి, రామకృష్ణారెడ్డి, సుక్క భాస్కర్, రవి, మహేష్‌చారి, రాజారాంయాదవ్ ఉన్నారు.

అమరచింత: హరియాణలో బీజేపీ విజయం సాధించడంతో పట్టణంలోని బీజేపీ జెండ కట్ట వద్ద బాణాసంచా కాల్చి సంబరాలు చేశారు. కార్యక్రమంలో మేర్వరాజు, మరాఠి అశోక్, నరాల నారాయణ, శ్యామ భాస్కర్, సిద్దు, రాములు, కృష్ణమూర్తి ఉన్నారు.

మెడిసిన్ విద్యార్థికి సన్మానం

వనపర్తి రూరల్: పెబ్బేరు మండలంలోని రాంపురం గ్రామానికి చెందిన ఆడెం వర్ష నీట్‌లో ర్యాంక్ సాధించి మెడిసిన్‌లో సీటు సాధించిది. మంగళవారం ఆమెను గ్రామస్తులు శాలువాతో సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో ఎంకే మూర్తి, లక్ష్మన్న, గోకారి, ల్యాబ్ శివ, మల్లేష్, శివ, సుదర్శన్, పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం



ఆత్మకూర్‌లో పారిశుద్ధ్య కార్యక్రమాల్లో చైర్‌పర్సన్ గాయత్రి, అధికారులు

ఆత్మకూర్: పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని, సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా పంచాయతీ అధికారి, మండల ప్రత్యేకాధికారి బీరం సుబ్బారెడ్డి, తహసీల్దార్ చాంద్‌పాష, ఎంపీడీఓ సుజాత, ఎంపీఓ శ్రీరాంరెడ్డి తెలిపారు. మంగళవారం డ్రై డే కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని గ్రామాల్లో ముమ్మరంగా పారుశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించారు.కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి సిబ్బంది ఉన్నారు.

ముమ్మరంగా కార్యక్రమాలు..

ఆత్మకూర్ పట్టణంలోని 7వ వార్డులో కౌన్సిలర్ నాగలక్ష్మీరెడ్డి ఆధ్వర్యంలో డ్రై డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ గాయత్రి, వైస్‌చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, కమిషనర్ నాగరాజు, స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీనివాస్‌లు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వార్డుల అధికారులు, పురసిబ్బంది ఉన్నారు.

నిల్వ నీటితోనే దోమలు వృద్ధి

పాన్‌గల్: గ్రామాల్లోని పలు కాలనీల్లో నిల్వ నీటితోనే దోమలు వృద్ధి చెంది రోగాలు సంభవిస్తున్నాయని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రామయ్య అన్నారు. డ్రై డేలో భాగంగా మంగళవారం మండలంలోని గోప్లాపూర్‌లో పలు కాలనీల్లో వైద్య సిబ్బందితో ఆయన పర్యటించారు. మలేరియా, డెంగీ, చికెన్ గున్యా వంటి వ్యాధులు రాకుండా వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. నీటి తొట్లు, డ్రమ్ములను వారానికి ఒక్కసారి నీటిని పారబోసి నూతన నీటిని పట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది రాంచందర్, పంచాయతీ కార్యదర్శి విష్ణు, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



పాన్‌గల్ మండలం గోప్లాపూర్‌లో నిల్వ నీటిని పరిశీలిస్తున్న వైద్య సిబ్బంది

అమరచింత: పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ఆరోగ్యంగా ఉంటామని ఎంపీడీఓ శ్రీనివాస్ అన్నారు. డ్రై డే కార్యక్రమంలో భాగంగా మండలంలోని పాంరెడ్డిపల్లెలో స్వచ్ఛత కార్యక్రమాలను పరిశీలించారు. అనంతరం గ్రామపంచాయతీ రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శితో పాటు పలువురు పాల్గొన్నారు.

ఎంపీ కృషితో డీఎస్సీ అభ్యర్థులకు ఆర్‌సీఐ ధ్రువపత్రాలు



డా.మల్లురవి ద్వారా ఆర్‌సీఐ ధ్రువపత్రాలు అందుకుంటున్న డీఎస్సీ అభ్యర్థులు

పాన్‌గల్: నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డా.మల్లురవి ప్రత్యేక కృషితో డీఎస్సీ అభ్యర్థులకు ఆర్‌సీఐ (రీహాబీలేషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా) ధ్రువపత్రాలు అందినట్లు స్పెషల్ ఎడ్యుకేషన్ సెకండరీ గ్రేడ్ టీచర్ అభ్యర్థులు మంగళవారం పేర్కొన్నారు. స్పెషల్ ఎడ్యుకేషన్‌లో సెకండరీ గ్రేడ్ టీచర్ ఉద్యోగానికి ఎంపికైన అభ్యర్థులు ఆర్‌సీఐ ధ్రువపత్రం కోసం దరఖాస్తు చేసుకున్నారు. సమయానికి ఆర్‌సీఐ ధ్రువపత్రాలు రాకపోతే ఉద్యోగం రాదనే ఆందోళన చెందుతున్న తరుణంలో కేతేపల్లికి చెందిన డీఎస్సీ అభ్యర్థి కార్తీక్ ఉమ్మడి జిల్లా డీసీసీబీ చైర్మన్ మామిళ్ళపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లాడు. ఆయన సమస్యను ఎంపీ మల్లు రవికి వివరించారు. వెంటనే ఎంపీ స్పందించి ఢిల్లీలోని ఆర్‌సీఐ కార్యాలయానికి వెళ్లి సెక్రటరీతో మాట్లాడారు. తెలంగాణలో దాదాపుగా 10 జిల్లాల నుంచి 30 మంది అభ్యర్థులకు వెంటనే ఆర్‌సీఐ ధ్రువపత్రాలు ఇప్పించినట్లు తెలిపారు. ఆర్‌సీఐ ధ్రువపత్రాలు అందేలా చర్యలు తీసుకున్న ఎంపీకి, డీసీసీబీ చైర్మన్‌కు డీఎస్సీ అభ్యర్థులు కృతజ్ఞతలు తెలిపారు.

గ్రామాల్లో మంచినీటి సహాయకులు



స్టార్టర్ల మరమ్మతు గురించి వివరిస్తున్న శిక్షకుడు(ఫైల్)

- స్వచ్ఛమైన నీరు అందించడమే లక్ష్యం
- మండలంలో మల్టీపర్పస్ వర్కర్లకు అవకాశం
- నైపుణ్య శిక్షణ, ధ్రువీకరణ పత్రాల అందజేత
- నీటి సమస్యలకు చెక్ పెట్టేందుకే..

పాన్‌గల్: ప్రతి ఇంటికి స్వచ్ఛమైన నీటిని అందించేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న మిషన్ భగీరథ పథకాన్ని పటిష్టం చేసేందుకు ప్రత్యేక ప్రణాళికలు తయారు చేస్తోంది. ఈ పథకం అమలులో సరియైన సిబ్బంది లేక చాలా గ్రామాల్లో మిషన్ భగీరథ నీరు అందడం లేదు. దీనిని అధిగమించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం నీటి సరఫరాను పకడ్బందీగా అమలు చేసేందుకు పథకంలో స్వల్ప మార్పులకు శ్రీకారం చుట్టింది. గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న మల్టీపర్పస్ కార్మికులను నీటి సరఫరా సహాయకులుగా నియమించి బాధ్యతలు అప్పగించనుంది. వారికి ఆయా మండల కేంద్రాల్లో నాలుగు రోజుల పాటు శిక్షణ సైతం అందించింది. కొన్ని మండలాల్లో శిక్షణ కొనసాగుతోంది. శిక్షణతో గ్రామాల్లో మంచినీటి వ్యవస్థ మెరుగుపడటంతో పాటు మరమ్మతుకు నోచుకొని చేతిపంపులను కూడా వినియోగంలోకి వస్తాయని మండల ప్రజలు ఆశిస్తున్నారు.

శిక్షణలో నేర్పించిన అంశాలు..

■ నిరుపయోగంగా ఉన్న చేతి పంపులు గుర్తించడం, వాటిని బాగు చేసి ఉపయోగంలోకి తెచ్చి, వాటి విడి భాగాలపై పూర్తి అవగాహన కల్పించారు.



ధ్రువపత్రం అందుకుంటున్న మల్టీపర్పస్ కార్మికుడు(ఫైల్)

■ బోరు మోటారు పనితీరుపై అవగాహన స్టార్టర్, ఫీలు పోతే మరమ్మతులు చేయడం.

■ లీకేజీ పైపులను తొలగించడం, కొత్తవి ఏర్పాటు చేయడం, పగిలిన పైపులను అతికించడంపై శిక్షణ ఇచ్చారు.

■ నీటి నాణ్యత పరీక్షలు, క్లోరినేషన్ తదితర అంశాలపై శిక్షణ, నీటి ట్యాంకుల శుభ్రం చేయడం, చివరి ఇంటికి సైతం శుద్ధ జలం అందించేలా నైపుణ్యం కల్పించడం వంటి అంశాలు వివరించారు.

మండల పరిస్థితి ఇలా..

మండలంలో 28 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఆయా గ్రామాల్లో మిషన్ భగీరథ నీరు సక్రమంగా సరఫరా అయ్యేందుకు గ్రామానికి ఒక్కొక్కరు చొప్పున, పెద్ద గ్రామాల్లో ఇద్దరు చొప్పున మొత్తం 84 మందికి శిక్షణ ఇచ్చారు.

గ్రామస్థాయిలో పరిష్కారానికే..

గ్రామ స్థాయిలో తాగునీటి సరఫరాలో ఎదురయ్యే సమస్యలను అధిగమించేందుకు మల్టీపర్పస్ కార్మికులకు నాలుగు రోజుల పాటు మండల స్థాయిలో శిక్షణ ఇచ్చారు. చేతిపంపులు, బోరు మోటార్ల మరమ్మతులు, క్లోరినేషన్, నీటి పరీక్షలు, లీకేజీలు సరి చేయడం వంటి పనులు కార్మికులు చేయాల్సి ఉంటుందన్నారు. గ్రామాల్లో నీటి సమస్యలను పరిష్కారం చేస్తాం.

– గోకారి, వాటర్‌మెన్, పాన్‌గల్

మండలస్థాయి శిక్షణకు వెళ్లాను

గ్రామ పంచాయతీలో వాటర్‌మెన్ మెకానిక్‌గా పనిచేయడానికి మండల స్థాయిలో ఇచ్చిన శిక్షణకు వెళ్లాను. శిక్షణలో మిషన్ భగీరథ నీటి సరఫరా సాఫీగా సాగేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సమస్యలు ఉత్పన్నమైనప్పుడు వాటిని పరిష్కరించేందుకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. శిక్షణలో బోరుమోటారు, చేతిపంపులు, పైపులైన్లు లీకేజీల మరమ్మతులు, నూతన పైపులైన్ల ఏర్పాటుపై పూర్తి స్థాయిలో శిక్షణ ఇచ్చారు. – రామకృష్ణ, వాటర్‌మెన్, తెల్లరాళ్లపల్లి

పూర్తిస్థాయిలో..

మంచినీటి సహాయకులకు గ్రామాల్లో తలెత్తే చిన్న, చిన్న సమస్యలను అప్పటికప్పుడు పరిష్కరించేలా శిక్షణ ఇచ్చాం. సింగిల్ ఫేస్, త్రీఫేస్ మోటార్లు చెడిపోతే అప్పటికప్పుడు మరమ్మతు చేయడం, కొత్త పైపులైన్లు ఏర్పాటు చేసే విధానం, నీటి ట్యాంకుల శుభ్రం, క్లోరినేషన్ సక్రమంగా ఉండేలా చూసుకోవడం, తదితర అంశాలపై శిక్షణ ఇచ్చి ధ్రువపత్రాలు అందజేశాం.

– అమిత్‌కుమార్, డీఈ, ఆర్‌డబ్ల్యూఎస్, వనపర్తి

రామ రామ రామ ఉయ్యాలో..

- అలిగిన బతుకమ్మకు పూజలు..
- అలరించిన మహిళల సంబురాలు
- గ్రామాల్లో ఘనంగా బతుకమ్మ వేడుకలు



ఆత్మకూర్‌లోని వాసవీమాత ఆలయంలో అలిగిన బతుకమ్మకు పూజలు నిర్వహిస్తున్న మహిళలు

ఆత్మకూర్: 'రామ రామ ఉయ్యాలో.. రామనే శ్రీరామ ఉయ్యాలో..' అంటూ మహిళలు బతుకమ్మ సంబురాలు నిర్వహించారు. మంగళవారం రాత్రి అలిగిన బతుకమ్మలను పూలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. బొడ్డెమ్మలు వేస్తూ ఆడి పాడారు. వాసవిమాత, నీలకంఠేశ్వరుడు, బాలబ్రహ్మేశ్వర ఆలయాల్లో, కేశవనగర్, భార్గవినగర్, శివాజీనగర్‌తో పాటు మండలంలోని గ్రామాల్లో మహిళలు పెద్ద ఎత్తున అట్ల బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. అనంతరం చెరువుల్లో బతుకమ్మలను నిమజ్జనం చేశారు.





ఆత్మకూర్‌లో బతుకమ్మ సంబరాలు నిర్వహిస్తున్న మహిళలు